సాక్షి తిరుపతి

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



ఎమ్మెల్యే నాని పేరుతో బరితెగింపు

ఎమ్మెల్యే నాని పేరుతో ఓ టీడీపీ నేత బరితెగిస్తున్నాడు. ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్న భూమిని ఆక్రమిస్తున్నాడు. - 10లో



పనపాకంలో ఏనుగుల గుంపు!

పనపాకంలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. పంటలను తొక్కి నాశనం చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. - 10లో



మహిళా వర్సిటీలో..

తిరుపతిలోని మహిళా వర్సిటీలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి ఎక్స్‌పోజర్ విజిట్ నిర్వహించారు. - 10లో

న్యూస్‌రీల్

29న జెడ్పీ సర్వసభ్య సమావేశం

- అధికారులు సమగ్ర సమాచారంతో రావాలి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశం 29న మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ రవి కుమార్‌నాయుడు తెలిపారు. అజెండాలోని అంశాలైన వ్యవసాయం, ఉద్యాన, విద్య, వైద్య, గృహ నిర్మాణ, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, అంగన్‌వాడీశాఖల పరంగా చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. సంబంధిత జిల్లా అధికారులు సమగ్ర సమాచారంతో కార్యక్రమానికి రావాలని తెలిపారు.


పారదర్శకంగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారు చేయాలని డీఆర్వో నరసింహులు సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో డీఆర్వో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాతో పాటు ఎన్నికల బూత్ కేంద్రాల అంశానికి సంబంధించి సూచనలు, సలహాలు ఇస్తే స్వీకరిస్తామన్నారు. గత నెలలో ఇచ్చిన సలహాలను అమల్లోకి తీసుకొచ్చామని తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, డీటీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

అధికార దర్పంతో కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. గత ప్రభుత్వంలో తమ పప్పులు ఉడకక తోకముడిచిన చోటామోటా నేతలు బరితెగిస్తున్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల పరంపరను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గతంలో తమకు అడ్డొచ్చిన అధికారులతో చెడుగుడు ఆడేస్తున్నారు. ఇది చాలదన్నట్టు గతంలో ఆక్రమించుకుని, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి కబ్జా చేస్తున్నారు. చదును చేసి, కంచె ఏర్పాటు చేసి.. 'ఇది నా అడ్డా!' అని జబ్బలు చరుస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులుగానీ, ప్రజాప్రతినిధులు గానీ నోరు మెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది.



కందాడు సమీపంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వభూమి

నన్నాపేదెవడ్రా?

- కందాడులో ప్రభుత్వ భూమి కబ్జా
- ఇవే భూములు గతంలోనూ ఆక్రమించిన టీడీపీ నేత
- ఆ భూములు ప్రభుత్వానివేనని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు
- నేడు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మరోసారి ఆక్రమణ
- దర్జాగా చదునుచేసి భూమి చుట్టూ కంచె ఏర్పాటు
- రెవెన్యూ అధికారుల సహకారంతో పక్కా రికార్డులు చేసుకునేందుకు ప్లాన్!

సాక్షి ప్రతినిధి, తిరుపతి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి నేతలు బరితెగిస్తున్నారు. ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు. ఆక్రమించుకుని, అనుభవించేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మాట విననివారిపై చిందులు తొక్కుతున్నారు. ఎదురుతిరిగిన వారిపై కక్ష్యగట్టి వేధింపులకు పాల్పడుతున్నారు. అలాంటిదే శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండల పరిధిలో చోటు చేసుకుంది. అసలు ఆ కబ్జా కథ ఏంటో మీరే చదవండి!

అడ్డుకున్నా బరితెగింపేనా?

2019 ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు సదరు టీడీపీ నేత కందాడులోని ప్రభుత్వ భూమిని హడావుడిగా ఆక్రమించుకున్నాడు. ఆ భూముల్లో కూలీలను పెట్టి మామిడి మొక్కలు నాటించాడు. నాడు స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చినా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పెద్దగా పట్టించుకోలేదు. ఎన్నికలు ముగిశాక వెంటనే ఆ భూముల్లో నాటిన మామిడి చెట్లను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత ఆ భూములను ఎవ్వరూ ఆక్రమించుకునేందుకు సాహసం చేయలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండవ రోజే సదరు టీడీపీ నేత మరోసారి చెలరేగిపోయాడు. యథేచ్ఛగా ఆక్రమించుకుని స్వాధీనం చేసుకునేందుకు పెద్ద స్కెచ్చేయడం గమనార్హం.

కక్ష్యగట్టి బదిలీ

ఆక్రమితమ భూములను స్వాధీనం చేసుకున్న అధికారులపై సదరు టీడీపీ నేత కక్ష్యగట్టాడు. భూములను స్వాధీనం చేసుకున్నప్పుడు ఎవరెవరు పాల్గొన్నారో వారందర్నీ వేధించడం మొదలు పెట్టాడు. నాడు ఆక్రమిత భూముల్లోకి వచ్చి స్వాధీనం చేసుకున్న అధికారులను ఐదు నెలల క్రితం తన పలుకుబడిని ఉపయోగించి బదిలీ చేయించినట్లు తెలిసింది. ప్రాధాన్యత లేని పోస్టుల్లోకి బదిలీచేసి వారిని తీవ్రంగా హింసిస్తున్నట్లు కలెక్టరేట్‌లో పని చేసే ఓ అధికారి చెప్పడం ఆందోళన కలిగిస్తోంది.

ఫ్రీహోల్డ్ కింద రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్కెచ్

అభ్యంతరం లేని భూములను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు గత ప్రభుత్వ అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. 20 ఏళ్లుగా ఎవరి అనుభవంలో ఉంటే ఆ భూములను ఫ్రీహోల్డ్ కింద రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. ఆ జీఓను అడ్డుపెట్టుకుని ఇప్పటికే కొందరు టీడీపీ నేతలు దొంగ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. ఆ కోవలోనే కందాడు పరిధిలో ఆక్రమించుకున్న భూములు 20 ఏళ్లుగా తమ అనుభవంలో ఉన్నట్లు రికార్డులు తయారు చేసి ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందుకు అవసరమైన పన్ను రసీదులు, రెవెన్యూ రికార్డుల్లో తన అనుభవంలో ఉన్నట్లు రికార్డులు తయారుచేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు అధికారి ఒకరు తెలియజేశారు. అందుకు అధికారులు ససేమిరా అన్నట్లు తెలిసింది. ఉన్నతాధికారుల ద్వారా చెప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఆక్రమించి.. చుట్టూ రాళ్లు నాటి

శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండలం, కందాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నం.516లోని 15 ఎకరాల ప్రభుత్వ భూమిని టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించాడు. ఎన్నికల కౌంటింగ్ తర్వాత జేసీబీలు, కూలీలను పెట్టి చదును చేశాడు. చుట్టూ రాళ్ల నాటి కంచె ఏర్పాటు చేశాడు. అదేవిధంగా ఇదే కందాడు రెవెన్యూ పరిధిలోని శివగిరి కాలనీ సమీపంలోని మరో ఐదెకరాల ప్రభుత్వ భూమిని అదే టీడీపీ నేత ఆక్రమించుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఆక్రమించుకుంటున్న విషయం తెలిసినా సంబంధిత రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. గ్రామస్తులు, స్థానికులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోంది.




దర్జాగా ఫెన్సింగ్

అది ప్రభుత్వ భూమే

కందాడులో ఆక్రమణకు గురైన భూమి డీకేటీది. ఎన్నికల ముందు ఆ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకోవడంతో.. రెవెన్యూ అధికారులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల తర్వాత మళ్లీ ఆ వ్యక్తి ఆ భూమి తనదంటూ చదును చేసి, ఫెన్సింగ్ వేసినట్టు తెలిసింది. మామిడి చెట్లు నాటానని, కోర్టు నుంచి స్టేటస్ కో తెచ్చుకున్నానని చెబుతున్నాడు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– భార్గవి, తహసీల్దార్, ఏర్పేడు మండలం

మెగా మెలిక.. అంతా తికమక



- టెట్ ఉత్తీర్ణత సాధించినా డీఎస్సీ అర్హత కఠినతరం
- పది, ఇంటర్‌లో 50 శాతం అర్హత అవసరమా!
- ఇంటర్ తప్పి తిరిగి 35 శాతంతో పాసైన వారు ఐఏఎస్‌లు కాలేదా?
- సివిల్స్‌కు లేని నిబంధనలు డీఎస్సీకి ఎందుకు?
- ఇది కుట్రలో భాగమే అంటున్న నిరుద్యోగులు
- మండిపడుతున్న విద్యార్థి సంఘాలు, డీఎస్సీ అభ్యర్థులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	3,766
ప్రాథమికోన్నత పాఠశాలలు	445
ఉన్నత పాఠశాలలు	705
ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు	సుమారు 6,245
ప్రస్తుతం భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చిన పోస్టులు	1,478
పోటీపడనున్న అభ్యర్థులు	72 వేల మంది
అర్హత మెలికతో డీఎస్సీకి దూరం కానున్న అభ్యర్థులు	సుమారు 14వేల మంది

తిరుపతి సిటీ: ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వివాదాలకు తావిస్తోంది. డీఎస్సీకి దరఖాస్తు చేయాలంటేనే అభ్యర్థులు వణికిపోతున్నారు. ఆన్‌లైన్ అగచాట్లు తలబొప్పి కట్టిస్తుండగా.. అర్హత నిబంధనలు తికమకపట్టిస్తున్నాయి. పది, ఇంటర్‌లో 40 నుంచి 50శాతం మార్కులు సాధించి ఉండాలని, అలాగే డిగ్రీలో 50శాతం, పీజీలో 55 శాతం తప్పనిసరి చేయడంతో అభ్యర్థులు అయోమయంలో పడ్డారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 శాతం వెసులుబాటు కల్పించారు. గతంలో జరిగిన డీఎస్సీలో ఇలాంటి కఠిన నిబంధనలు లేవని, కొత్తగా పది, ఇంటర్, డిగ్రీ మార్కుల అర్హతలను ప్రామాణికం చేయడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదని డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది కుట్రలో భాగమేనా?

సివిల్స్ సర్వీసుకు సైతం ఎలాంటి నిబంధనలు లేవు. పది, ఇంటర్‌లో సప్లిమెంటరీ పరీక్షలు రాసి 35 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఎంతో మంది సివిల్స్ సాధించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులయ్యారు. అలాంటిది టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించినా పది, ఇంటర్, డిగ్రీల పర్సెంటేజ్‌పై నిబంధనలు పెట్టడం విమర్శలకు తావిస్తోంది. డీఎస్సీని సజావుగా జరపకూడదనే కుట్రతోనే ప్రభుత్వం మెలికలతో కూడిన డీఎస్సీని విడుదల చేసిందని నిరుద్యోగులు, విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

మా పరిస్థితి అగమ్యగోచరమే



పదో తరగతిలో 40 శాతం వచ్చాయి. ఆరోగ్యం సరిలేకపోవడంతో ఇంటర్‌లో 39.5 శాతంతో పాసయ్యా. డిగ్రీ 47 శాతం వచ్చాయి. పీజీ 60 శాతం ఉంది. బీఈడీ పూర్తి చేసి టెట్‌లో ఉత్తీర్ణత సాధించాను. నోటిఫికేషన్ వచ్చిందని సంతోషపడ్డా. కానీ అర్హతల విషయంలో ప్రభుత్వం మెలిక పెట్టడంతో ఆశలు ఆవిరైపోతున్నాయి. లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకున్నా. గతంలో డీఎస్సీకి ఉన్న అర్హతలనే కొనసాగించాలి.

–చంద్రశేఖర్, డీఎస్సీ అభ్యర్థి, తిరుపతి రూరల్

ఆశలపై నీళ్లు చల్లద్దు



టీచర్ కావాలన్న లక్ష్యం డీఎస్సీకి కొన్ని ఏళ్లుగా సన్నద్ధమవుతున్నా. అర్హత మార్కులంటూ మెలిక పెట్టడం దారుణం. పది, ఇంటర్‌లో 55 శాతానికిపైగా మార్కులు వచ్చాయి. కానీ డిగ్రీలో 48 శాతం మాత్రమే వచ్చాయి. టెట్ అర్హత సాధించా. డిగ్రీలో 50శాతం అనే నిబంధన బాధకలిగిస్తోంది. గతంలో లేని కఠిన నిబంధనలు ఇప్పుడు ఎందుకు పెడుతున్నారో, అందులో ఆంతర్యమేమిటో అర్థం కాలేదు. మాలాంటి వారి ఆశలపై నీళ్లు చల్లద్దు.

–సుకన్య, డీఎస్సీ అభ్యర్థి, తిరుపతి

అప్పుడు లేని నిబంధనలు ఇప్పుడెందుకో?



డీఎస్సీకి గతంలో ఇలాంటి కఠిన నిబంధనలు లేవు. డీఎస్సీకి టెట్ పరీక్ష ప్రామాణికంగా ఉండేది. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వదిలిందన్న సంతోషం ఆవిరైపోయింది. అర్హతల విషయంలో వెంటనే ప్రభుత్వం స్పందించాలి. గతంలో డీఎస్సీ అర్హతలనే కొనసాగిస్తూ రీ నోటిఫికేషన్ ఇవ్వాలి. ఇంటర్, డిగ్రీ, పీజీలలో 50శాతం దాటని మాలాంటి ఓసీ అభ్యర్థులు వందల మంది అనర్హులుగా మిగిలిపోతారు.

–ప్రసన్నలక్ష్మి, డీఎస్సీ అభ్యర్థి, శ్రీకాళహస్తి

అంతా అయోమయం



డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారన్న సంతోషం లేదు. అర్హతలలో మెలిక పెట్టేశారు. అన్ని అర్హతలు ఉన్న సర్టిఫికెట్లను దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని నిబంధన పెట్టారు. అంతా అయోమయంగా ఉంది. 90 శాతం మంది అభ్యర్థులు ఇంటా ధ్రువపత్రాల వేటలో ఉన్నారు. మార్కుల జాబితాతో పాటు, కుల, ఆదాయ ధ్రువపత్రాలను సైతం తీసుకోవడానికి సమయం తక్కువ. అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. నిబంధనలను సడలించాలి.

–హరిత, డీఎస్సీ అభ్యర్థి, తిరుపతి

అస్తవ్యస్తంగా ఉంది



కూటమి ప్రభుత్వం కుట్రలో భాగంగానే మెగా డీఎస్సీ విడుదల చేసిందనిపిస్తోంది. డీఎస్సీకి గతంలో ఎన్నడూ లేని నిబంధనలు విధించారు. గతంలో ఏ డీఎస్సీలోనూ ఇలాంటి నిబంధనలు లేవు. పది, ఇంటర్ మార్కుల పర్సెంటేజ్ ఎందుకో. సివిల్స్‌కు సైతం ఇలాంటి నిబంధనలు లేవు. టీటీసీ అభ్యర్థులకు అర్హత నిబంధనలు వేరుగా, బీఈడీ అభ్యర్థులకు నిబంధలను వేరుగా ఉన్నట్లు తెలుస్తోంది.

–జెన్నే మల్లికార్జున, డీఎస్సీ అభ్యర్థి, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి, తిరుపతి

ఉద్యమం తప్పదు




గతంలో ఎన్నడూ లేనివిధంగా డీఎస్సీకి లేనిపోని మెలికలు పెట్టడం దారుణం. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అర్హతల విషయంలో ఎంతోమంది అభ్యర్థులు అనర్హులుగా మిగిలిపోతారు. కుట్రలో భాగంగానే కండీషన్స్ పెట్టారని అనిపిస్తోంది. టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన వారికి విద్యార్హతల మెలిక ఎందుకు పెట్టారో అర్థం కావడంలేదు. గతంలో డీఎస్సీకి ఉన్న అర్హతలే ప్రస్తుత డీఎస్సీకి కొనసాగించాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

–భగత్‌రవి, డీఎస్సీ అభ్యర్థి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

దివికేగిన గ'ఘన కీర్తి'

- ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ కన్నుమూత
- ఆయన సేవలు గుర్తుచేసుకున్న శాస్త్రవేత్తలు
- పలువురి నివాళి



ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ (ఫైల్)

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తొలితరం శాస్త్రవేత్తల్లో ముఖ్యులు, అలాగే ఇస్రో చైర్మన్‌గా పదేళ్ల పనిచేసిన డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ (85) శుక్రవారం బెంగళూరులోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో ఇస్రో శాస్త్రవేత్తలు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన సేవలు అజరామరమని, ఆయన లేని లోటు తీర్చలేనిదని కుమిలిపోయారు.

అనుభవాల 'గని'

షార్‌లో ప్రయోగం జరిగిన ప్రతిసారీ కస్తూరిరంగన్ ఇక్కడకు విచ్చేసి తన అనుభవాలను పంచుకునేవారు. చంద్రయాన్-1, 2, 3, మంగళ్‌యాన్-1, ఆదిత్య ఎల్1 లాంటి ప్రతిష్టాత్మక ప్రయోగాలు చేసిన ప్రతిసారీ ఆయన ఇక్కడకు విచ్చేసి సలహాలు, సూచనలు ఇచ్చేవారు. అదేవిధంగా సూళ్లూరుపేట పట్టణంలో 150 ఏళ్ల ముందు నిర్మించి, శిథిలావస్థకు చేరిన ఉన్నత పాఠశాల అభివృద్ధికి తన వంతుగా రూ.25 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించారు.

ఇస్రో చైర్మన్‌గా కస్తూరిరంగన్ ప్రయాణం

ఇస్రోలో కస్తూరిరంగన్ 1971 నుంచి వివిధ హోదాల్లో పనిచేశారు. అనంతరం 1994లో ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 2003 ఆగస్టు 27న పదవీ విరమణ చేశారు. 2003 దాకా పనిచేసిన ఆయన పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ మార్క్-3 లాంటి భారీ రాకెట్ల రూపకల్పనలో ఆయన భాగస్వామ్యం ఎంతో ఉంది. 1994లో ఏఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఒక ప్రయోగం, పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో పీఎస్ఎల్‌వీ డీ2 ప్రయోగంతో ప్రారంభమై ఏడు పీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగాలకు సారథ్యం వహించారు. అప్పుడే పురుడుపోసుకున్న జీఎస్ఎల్‌వీ రాకెట్ సిరీస్‌లో కూడా రెండు ప్రయోగాలు ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. పదేళ్లు చైర్మన్‌గా పనిచేసిన కాలంలో పది ప్రయోగాలను నిర్వహించారు. ఇస్రో నిర్వహించిన వంద ప్రయోగాలను ఆయన వీక్షించడం విశేషం. ఆయన చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ,, పద్మభూషణ్, పద్మవిభూషణ్ లాంటి అవార్డులను అందజేసింది. ఇవి కాకుండా ఆయన 45 అవార్డులను అందుకున్నారు. ఖగోళశాస్త్రం, అంతరిక్ష శాస్త్రం, అంతరిక్ష అనువర్తనాలు వంటి రంగాలపై ఆయన రాసిన వ్యాసాలు అంతర్జాతీయ, జాతీయ ప్రతికలలో ప్రచురితమయ్యాయి. అలాగే ఆయన ఆరు పుస్తకాలను కూడా రచించి నేటి తరం విద్యార్థులకు అందించారు. షార్ డైరెక్టర్ ఏ రాజరాజన్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అన్ని విభాగాలకు చెందిన ఏడీలు, శాస్త్రవేత్తలు ఆయనకు తమ సంతాపాన్ని తెలియజేశారు.

కస్తూరి రంగన్‌కు అశ్రునివాళి

తిరుపతి సిటీ: సుప్రసిద్ధ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మాజీ చైర్మన్, భారత దేశ అంతరిక్ష విభాగ శాస్త్రవేత్త, నూతన విద్యావిధానాల రూపశిల్పి డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్‌కు ఎస్వీయూ అశ్రునివాళి అర్పించింది. ఎస్వీయూతో ఆయనకున్న అనుబంధాన్ని వీసీ అప్పారావు గుర్తుచేశారు. అంతరిక్ష విజ్ఞాన శాస్త్రం, జాతీయ విద్యాఅభివృద్ధికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా వర్సిటీ డాక్టర్ ఆఫ్ సైన్స్ గౌరవ డిగ్రీని ప్రదానం చేసిందని తెలిపారు. 2022లో వర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందించారని తెలిపారు. ఎన్ఈపీ-2020 కమిటీ చైర్మన్‌గా పనిచేసిన ఆయన విద్యావ్యవస్థలో పలు సంస్కరణలకు మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని వీసీ ప్రార్థించారు.

ఇస్రో మాజీ చైర్మన్‌కు నివాళి

సూళ్లూరుపేట: ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కే.కస్తూరిరంగన్‌కు షార్ కేంద్రంలో అశ్రునివాళి అర్పించారు. షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్ ఆధ్వర్యంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. షార్ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ, ఇతర డిప్యూటీ డైరెక్టర్లు ఆయన సేవలను కొనియాడారు.



ఎస్వీయూ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న కస్తూరిరంగన్ (ఫైల్)



ఇస్రో మాజీ చైర్మన్ చిత్ర పటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న షార్ అధికారులు, ఉద్యోగులు

ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత

శ్రీకాళహస్తి: ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి ఆదినారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం తిరుపతి జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయవాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రాథమిక విద్యావ్యవస్థ పటిష్టంగా ఉండాలని చెప్పారు. అందుకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను కొనసాగించాలని చెప్పారు. ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను తొలగించమంటే 1, 2 తరగతులను నేడు విలీనం చేస్తున్నారని మండిపడ్డారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు. రమేష్‌బాబు, జగన్నాథం, కఠారి మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గురుప్రసాద్, యువశ్రీ మురళి, రామాంజనేయులు, రేణుకాదేవి, శారదమ్మ, హరికృష్ణ, గుమ్మడి మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

క్లుప్తంగా

భార్య మృతి కేసులో ముగ్గురి అరెస్ట్

బుచ్చినాయుడుకండ్రిగ: వేధింపుల కారణంగా మృతిచెందిన భార్య కేసులో శుక్రవారం ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. వివరాలు.. మండలంలోని అరిగిలకండ్రిగ గ్రామంలోని ఆరుంధతివాడకు చెందిన పల్లవి (19) తొట్టంబేడు మండలం, దిగువ సాంబయ్యపాళెం గ్రామంలోని ఆరుంధతివాడకు చెందిన మాతయ్య అలియాస్ చరణ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. పెళ్లైన కొద్ది రోజులకే అనుమానంతో భర్త చరణ్, మామ కృష్ణయ్య, అత్త నాగరాజమ్మ, ఆడపడుచు గౌరీ, కుమార్ వేధించారు. ఈ వేధింపులు తాళలేక మనస్తాపంతో గత మార్చి 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన ఎస్ఐ విశ్వనాథ నాయుడు పల్లవి భర్త చరణ్, మామ కృష్ణయ్య, అత్త నాగరాజమ్మను శుక్రవారం చల్లమాంబపురం బస్టాండ్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ఆడపడుచు గౌరీ, ఆమె భర్త కుమార్ కోసం గాలిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

దొరవారిసత్రం: మైనర్ బాలిక పట్ల అందలమాల శివ అనే యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించడంతో స్థానిక పోలీసులు పోక్సో యాక్ట్ కింద గురువారం రాత్రి కేసు నమోదు చేయగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానిక పోలీసుల కథనం.. మండలంలోని కట్టువాపల్లి గ్రామానికి చెందిన శివ నెల్లూరు నుంచి కట్టువాపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చిన మైనర్ బాలిక పట్ల మూడు రోజుల కిందట అసభ్యకరంగా ప్రవర్తించి ఇబ్బంది పెట్టాడు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాలిక సమీప బంధువులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ అజయ్‌కుమార్ పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్‌తో కలసి వైద్యాధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. లింగ నిర్ధారణ జరుగుతున్నట్లు అనుమానిస్తున్న స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లపై డికాయ్ ఆపరేషన్లు నిర్వహించి, కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిలా నోడల్ ఆఫీసర్ శాంతికుమారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాని పేరుతో బరితెగింపు

- 15 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమిని కాజేసే కుట్ర
- కోర్టులో కేసు నడుస్తుండగా దౌర్జన్యంగా భూమి చదును
- ఇదేమిటని ప్రశ్నిస్తే దాడికి యత్నిస్తున్నారంటున్న బాధితుడు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి ఎమ్మెల్యే నాని పేరుతో తన భూమిని దౌర్జన్యంగా కాజేసేందుకు స్థానిక నాయకుడు కిషోర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని బాధితుడు వాపోయాడు. పూర్తి వివరాలు బాధితుడు రమణారెడ్డి, ఆయన కుమారుడు శేషారెడ్డి మాటల్లోనే.. 'తిరుపతికి చెందిన రమణారెడ్డి 2004లో రూ.10లక్షలు వెచ్చించి తిరుచానూరు దళితవాడ సమీపంలోని సర్వే నం.334/12లోని 20 సెంట్ల భూమిని కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో తిరుచానూరుకు చెందిన మణిరెడ్డి అలియాస్ మణయ్య భూమి తనదంటూ తిరుపతిలో కేసు వేసి విఫలమయ్యాడు. ఈ క్రమంలో మరోసారి మణిరెడ్డి తనయుడు, తిరుచానూరు పంచాయతీకి



తిరుచానూరు దళితవాడ సమీపంలోని రమణారెడ్డి భూమిని అక్రమంగా చదును చేసిన టీడీపీ నేత

చెందిన టీడీపీ నేత కిషోర్‌రెడ్డి తప్పుడు పత్రాలను సృష్టించి కోర్టులో కేసు వేశారు. దీంతో రమణారెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో ఐదేళ్లుగా కోర్టులో కేసు నడుస్తోంది. ఇప్పుడు టీడీపీ నేత కిషోర్‌రెడ్డి తన అనుచరులతో కలసి భూమిలోకి అక్రమంగా ప్రవేశించాడు. టిప్పర్ల ద్వారా మట్టిని తరలించి, జేసీబీలతో చదును చేస్తున్నాడు. 'అధికారం మాది మా వెనుక ఎమ్మెల్యే నాని ఉన్నాడు..పనులకు అడ్డొస్తే నీ అంతు చూస్తా' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. న్యాయం చేయాలని తిరుచానూరు పోలీసులను ఆశ్రయిస్తే తనను బెదిరిస్తున్నారని, సీఐ సునీల్ కుమార్ తనను అమర్యాదగా మాట్లాడుతున్నారు'అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ, కలెక్టర్ చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

ఇంత అన్యాయమా?



నేను గత 15 ఏళ్ల క్రితం రమణారెడ్డికి చెందిన భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నా. అప్పట్లో ఆ భూమిపై కోర్టులో కేసు వేసినా, రమణారెడ్డికి అనుకూలంగానే తీర్పు వచ్చింది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చిందని దౌర్జన్యంగా ఇక్కడ పనులు చేస్తున్నారు. ఈ భూమి రమణారెడ్డికి చెందినదే. టీడీపీ నాయకుడు కిషోర్‌రెడ్డి కోర్టులో కేసు నడుస్తున్నా పట్టించుకోకుండా ఇలా చేయడం మంచిది కాదు. ఈ ప్రభుత్వంపై మాలాంటి దళితులకు నమ్మకం పోతోంది.

– మణి, కౌలు రైతు, తిరుచానూరు హరిజనవాడ

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలో మరి కొందరికి చోటు

చిత్తూరు అర్బన్/తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పలువురు నాయకులకు చోటు లభించింది. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రాష్ట్ర కమిటీలో పలువురికి అవకాశం కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర పబ్లిసిటీ విభాగ కార్యదర్శులుగా గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, కుప్పానికి చెందిన కె.మోహన్, నగరికి చెందిన కేవీ చంద్రశేఖర్, పుంగనూరుకు చెందిన ఎ.నారాయణ్‌రెడ్డి, తిరుపతి జిల్లాకు చెందిన దశరథరామిరెడ్డిని నియమించింది. రాష్ట్ర పబ్లిసిటీ విభాగ సంయుక్త కార్యదర్శిగా పూతలపట్టుకు చెందిన దేవేంద్రరెడ్డి, స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా సత్యవేడు సాయినాయుడు, తిరుపతి జిల్లాకు చెందిన ఎం.ఆదిశేషగిరిరావును నియమించింది. స్టేట్ గ్రీవెన్స్ సెల్ సహాయ కార్యదర్శులుగా గంగాధర నెల్లూరుకు చెందిన ఉమా చంద్రన్ రెడ్డి, కుప్పానికి చెందిన కుందననాథన్ రెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన అంకయ్య, తిరుపతి జిల్లాకు చెందిన దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డిని నియమించినట్లు పేర్కొంది. అలాగే తిరుపతికి చెందిన ఐ.చంద్రశేఖర్‌రెడ్డిని తిరుపతి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ఎస్వీయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్‌పై బదిలీ వేటు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లానాయక్‌ను ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజుల పాటు సెలవులో ఉన్న దామ్లానాయక్‌పై వేటు వేయడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్ల జారీలో జరిగిన గందరగోళంతోనే ఆయనపై వేటుపడిందనే చర్చ నడుస్తోంది. ప్రభుత్వ ఆన్‌లైన్ సంస్థ జ్ఞానభూమి పోర్టల్ సాంకేతిక లోపంతోనే హాల్‌టికెట్ల జారీలో తప్పులు దొర్లాయని, ఇది వర్సిటీ ఉద్యోగులకు సంబంధం లేని విషయమని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారులు సైతం తేల్చి చెప్పారు. సెలవులో ఉన్న దామ్లానాయక్‌పై బదిలీ వేటు వేయడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కాలేదని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు



ఎస్వీయూ ఎగ్జామినేషన్ సెక్షన్

నూతన కంట్రోలర్‌గా రాజమాణిక్యం

ఎస్వీయూ ఇంజినీరింగ్ విభాగంలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బీ.రాజమాణిక్యంను నూతన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా అధికారులు నియమించారు. వచ్చేనెల 3వ తేదీలోపు బాధ్యతలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మహిళా వర్సిటీలో నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్

తిరుపతి సిటీ: తిరుపతి సీబీఎస్ఈ సంస్థలు, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంయుక్తంగా శుక్రవారం వర్సిటీలో సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాళ్లకు రెండు రోజుల జాతీయ స్థాయి ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ పి విజయలక్ష్మీ, స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ టి సుధ మాట్లాడారు. మహిళా సాధికారిత సాధించడం, అన్ని రంగాలలో స్త్రీలను ప్రోత్సహించడం కోసం 42 ఏళ్ల క్రితం మహిళా వర్సిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రవేశం, సమానత్వం, నాణ్యత, అందుబాటు, బాధ్యత అనే ఐదు సూత్రాల ఆధారంగా రూపుదిద్దుకున్న జాతీయ విద్యా విధానం భవిష్యత్తులో ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు యువ మేధావులను తయారు చేస్తుందన్నారు. యూనివర్సిటీలో విద్యతో పాటు పరిశోధన, సామాజిక సేవ కార్యక్రమాలు, ప్రాజెక్టులు, ఇండక్షన్ ప్రోగ్రాం, కెరీర్ కౌన్సిలింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఈపీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆముదవల్లి, పలు విభాగాల డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పనపాకం పరిసరాల్లో ఏనుగుల గుంపు!

చంద్రగిరి: మండల పరిధిలోని పనపాకం అటవీ సమీప గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని ఆముదాల కోన చెరువు వద్దకు ఏనుగుల గుంపులు వచ్చినట్లు గుర్తించారు. చెరువులోని నీటిని తాగి పనపాకం అటవీ సమీపం వైపుగా వెళ్లినట్లు తెలిపారు. పంటపొలాల్లో ఏనుగుల పాదముద్రలు, చెరువు వద్ద ఏనుగులు సంచరించిట్లుగా రైతులు గుర్తించారు. పంట పొలాలపై ఏనుగులు దాడులకు పాల్పడకముందే అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్



పంట పొలాల్లో ఘీంకరిస్తున్న ఏనుగు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టిచెర్ల పంచాయతీలో ఒంటరి ఏనుగు ఘీంకరిస్తూ పంట పొలాల్లోకి దూసుకొచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి పంచాయతీ పరిధిలోని బోగేవాండ్లపల్లె గ్రామ పంట పొలాల్లోకి రావడంతో గ్రామస్తులు టపాకాయలు కాల్చుతూ.. శబ్దాలు చేస్తూ తరిమేందుకు ప్రయత్నించారు. దీంతో ఏనుగు ఘీంకరిస్తూ మనుషులు వైపు రావడంతో పరుగులు తీశారు. వరి పైరు తొక్కుకుంటూ అటు ఇటు తిరగడంతో రైతులు మిన్నుకుండిపోయారు. అధికారులు తక్షణం స్పందించి ఒంటరి ఏనుగును కట్టడి చేసి, గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ చిన్నగొట్టిగల్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సింహాల మోహన్ డిమాండ్ చేశారు.

వ్యాపారవేత్త జయరాం చౌదరి అరెస్ట్?

తిరుపతి క్రైమ్: తిరుపతికి చెందిన వ్యాపారవేత్త, మయూర హోటల్ యజమాని జయరాం చౌదరిని గురువారం రాత్రి చెన్నైలో తిరుపతి ఈస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. జయరామచౌదరిని అరెస్టు చేసిన తర్వాత ఆయన పోలీసులతో మాట్లాడిన అంశాలతో ఓ వీడియో గురువారం అర్ధరాత్రి తర్వాత సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కోల్‌కతా 8 కోట్ల రూపాయల చీటింగ్ కేసుకు సంబంధించి ఇప్పటికే జయరాం చౌదరికి వారెంట్ జారీచేశారు. ఈ క్రమంలోనే ఆయన్ను అరెస్ట్ చేసినట్లు తెలిసింది. అరెస్ట్ చేసే సమయంలో జయరాం చౌదరి కోల్‌కతా హైకోర్టులో అపీల్ దాఖలు చేశానని వారికి వివరించారు. రూ.8 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుని హైకోర్టులో 18 శాతం చెల్లించామని, అంతా కోర్టు ఆదేశాల మేరకే జరిందని తెలిపారు. ఇంతలోనే రూ.500 కోట్ల ఆస్తులు అటాచ్ చేసి జడ్జి ఆదేశాలు జారీ చేశారని పోలీసులకు వివరించారు. తన భార్య అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందుతోందని.. తనను బలవంతంగా తీసుకెళ్లాలంటే నా శవం వస్తుందని పోలీసులను బెదిరించాడు. అయితే పోలీసులు ఆయనను శుక్రవారం రాత్రి వరకు తిరుపతికి తీసుకురాలేదు. నేరుగా కోల్‌కతాకు తరలించే అవకాశం ఉన్నట్లుగా తెలిసింది. ఇదిలా ఉంటే గతంలో జయరాం చౌదరి షుగర్ ఫ్యాక్టరీ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు రైతులను మోసం చేసి తప్పించుకుని తిరుగుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.



పోలీసుల అదుపులో జయరాం చౌదరి

ఎర్రచ్రందనం కేసులో ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం కేసులో చిత్తూరు, గుడుపల్లి, లెనిన్ నగర్‌కు చెందిన సెల్వంకు ఐదేళ్లు జైలు శిక్ష, మూడు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచ్రందనం కేసుల విచారణ ప్రత్యేక సెషన్స్ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పుచెప్పారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమనాయుడు, పోలీస్ సిబ్బంది శివప్రసాద్, శివకుమార్ తెలిపిన వివరాలు.. 2022 అక్టోబర్ 8న తిరుపతి టాస్క్ ఫోర్స్ సిబ్బంది శేషాచలం రిజర్వ్ ఫారెస్ట్, టీఎస్ పాళ్యం బీట్, తిరుపతి రూరల్ మండలంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు సెల్వం మరి కొంతమంది అటవీ ప్రాంతంలో గొడ్డళ్లు, చాకులను తీసుకొని వెళ్తుండగా వారిని విచారించడానికి ప్రయత్నించారు. అయితే నిందితుడు సెల్వం ఫారెస్ట్ సిబ్బందికి పట్టుపడగా మరి కొంతమంది పరారయ్యారు. ఫారెస్ట్ సిబ్బంది నిందితుడు సెల్వంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి సెల్వంకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మరో కేసులో ఇద్దరికి ఏడాది జైలు

2014 డిసెంబర్ 26వ తేదీ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గోన్నుపల్లి సెక్షన్, రాపూర్ వెలుగొండ రిజర్వ్ ఫారెస్ట్, దాసరికోన అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి 83 కిలోల ఏడు ఎర్రచ్రందనం దుంగలను నరికి తరలిస్తున్న కేసులో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, గొన్నుపల్లికి చెందిన చల్ల రమణయ్య, బత్తల రమణయ్యకు ఒక్కొక్కరికీ ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచ్రందనం కేసుల విచారణ ప్రత్యేక జూనియర్ జడ్జి కోర్టు జడ్జి ఎస్ శ్రీకాంత్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ రామ శాంతి వాదించారు.

ఆపద వేళ అత్యుత్సాహమా?

జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణంలో కార్యకర్తలు అత్యుత్సాహం కనబరిచారు. ఇందులో భాగంగా వాహనాలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 108 వాహనం చిక్కుకుపోయింది. 108 వాహనానికి దారి ఇవ్వకుండా కార్యకర్తలు ముందుకు వెళుతూనే ఉండడం విమర్శలకు తావిచ్చింది. చేసేది లేక 108 వాహనం ర్యాలీ వెనుకే వెళుతుండడం చూసి స్థానికులు ముక్కున వేలేసుకోవడం కనిపించింది. ఇదేం పని అంటూ శాపనార్థాలు పెట్టారు.

– శ్రీకాళహస్తి



ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 వాహనం

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,227 మంది స్వామిని దర్శించుకున్నారు. 28,951 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.88 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లోకి వెళ్లాలని టీటీడీ సూచించింది.




కుందన సాయికి ఇన్నోవేషన్ అవార్డు



విద్యార్థిని కుందనసాయిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఎస్ఎస్ఐఐఈ, టీబీఐ ఇన్నోవేటర్ డి.కుందన సాయికి ఇన్నోవేషన్ అవార్డు లభించింది. ఆమె ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కలుషితమైన నీటిని శుద్ధి చేసే లక్ష్యంతో ఆల్గల్ ఆధారిత నీటి పునరుజ్జీవన పరికరం నమూనాను అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో ఈ నెల 24న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం సందర్భంగా ఆమెకు అధికారులు అవార్డును ప్రదానం చేశారు. ఆమెను వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, డాక్టర్ జే సూర్యకుమార్ అభినందించారు.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



ఊరేగుతున్న అమ్మవారు

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవి బంగారు తిరుచ్చిపై విహరించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

